క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



యాదగిరిని సన్మానిస్తున్న ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త నోముల యాదగిరి ఈనెల 23న మాతృదేవోభవ-పితృదేవోభవ స్వచ్ఛంద సంస్థ వారిచే బెస్ట్ సేవా అవార్డు పొందారు. ఈ సందర్భంగా ఆయనను ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. యాదగిరి చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సన్మానించిన వారిలో ఐతరాజు శ్రీనివాస్, వెలిమనేటి మల్లేష్, ముత్యాల స్వామి, బాలకృష్ణ, ముత్యాలు, లింగస్వామి, నాగరాజు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఆనంద్‌గౌడ్



ఆనంద్‌గౌడ్

వలిగొండ : మండలంలోని లింగరాజుపల్లి గ్రామానికి చెందిన బొడిగ ఆనంద్‌గౌడ్‌ను బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ గురువారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని, నా నియామకానికి సహకరించిన పాశం భాస్కర్, ఏలే చంద్రశేఖర్, బండారపు లింగస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

పోచంపల్లి బ్యాంకు 14వ వార్షికోత్సవం

చౌటుప్పల్ : పట్టణంలో పోచంపల్లి కోఆపరేటీవ్ అర్బన్ బ్యాంకు 14వ వార్షికోత్సవాన్ని స్థానిక బ్రాంచ్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. బ్యాంకులో అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు చైర్మన్ కె.బాలసుబ్రహ్మణ్యం, సీఈఓ శ్రీనివాస్, మేనేజర్ కె.రాజు, అకౌంటెంట్ సాయి, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

బడిబాటపై నేడు ప్రత్యేక సమావేశం

మోత్కూరు : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు బడిబాట కార్యక్రమంపై ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.మనోహర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 3నుంచి 19వతేదీ వరకు జరిగే బడిబాట కార్యక్రమం సందర్భంగా హెచ్‌ఎంలు, మండల స్థాయి అధికారులు, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సమావేశానికి విధిగా హాజరు కావాలని కోరారు.

గర్భిణులకు మెరుగైన సేవలందించాలి



సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ప్రోగ్రాం అధికారి పీఓడీటీ రామకృష్ణ

ఆత్మకూరు(ఎం) : గర్భిణులకు మెరుగైన సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి పీఓడీటీ డాక్టర్ రామకృష్ణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణుల రిజిస్ట్రేషన్, వారికి అందజేయాల్సిన సేవల గురించి సమీక్ష సమావేశంలో వివరించారు. సమావేశంలో డీపీహెచ్‌ఎన్‌ఓ సత్యవతి, వైద్యాధికారి వీరియం కేర్, సీహెచ్‌ఓ కరుణాకర్, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలి

భూదాన్‌పోచంపల్లి : జూన్ 2న నుంచి నిర్వహించే తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి రాపోలు జ్ఞానేశ్వర్ అన్నారు. గురువారం పట్టణంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజు జూన్ 2న కొండా లక్ష్మణ్‌బాపూజీ నివాసం హైదరాబాద్‌లోని జలదృశ్యంలో తెలంగాణ జాతిపిత లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి నూలు దండలతో నివాళులర్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు, చేనేత నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇస్త్రీ డబ్బా దగ్ధం

తుర్కపల్లి : ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఇస్త్రీ డబ్బా దగ్ధమైంది. వివరాలు.. మండల కేంద్రానికి చెందిన యడవల్లి శోభ స్థానికంగా ఇస్త్రీ డబ్బా నిర్వహిస్తోంది. గురువారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని ఇస్త్రీ డబ్బా పూర్తిగా దగ్ధమైంది. దీంతో డబ్బాలోని బట్టలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. శోభ కుమారుడు కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సైబర్ నేరాలపై జాగ్రత్త

- ఫోన్ నంబర్ హ్యాక్‌చేసి వాట్సాప్ ద్వారా మెసేజ్‌లు
- లింక్ ఓపెన్ చేస్తే ఖాతాల్లో డబ్బులు లాగేస్తున్న కేటుగాళ్లు
- అప్రమత్తతో మోసాలకు చెక్
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



రామన్నపేట వాట్సాప్‌గ్రూపులో చక్కర్లు కొడుతున్న ఏపీకే మెసేజ్

రామన్నపేట : సైబర్ నేరగాళ్లు కొత్తతరహా మోసాలకు తెరలేపారు. వినియోగదారుల ఫోన్ నంబర్లను హ్యాక్ చేసి వాట్సాప్ ద్వారా ఏపీకే మెసేజ్‌లను పంపుతున్నారు. ఈ మెసేజ్ ఓపెన్‌చేస్తే వారి నంబర్లు కూడా హ్యాక్ కావడంతో పాటు ఫోన్‌పే, గూగుల్‌పే, నెట్ బ్యాంకింగ్ నుంచి డబ్బులను లాగేస్తున్నారు.

వినియోగదారుల బలహీనతలే ఆసరాగా..

సైబర్ నేరగాళ్లు ఫోన్ వినియోగదారుల బలహీనతలను ఆసరా చేసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తుంది. ఈ పథకం ద్వారా తెల్లరేషన్ కార్డు కలిగిన బీపీఎల్ కుటుంబాలకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తుంది. దీనిని ఆసరాగా చేసుకున్న సైబర్ నేరస్తులు ఎలక్ట్రిసిటి బిల్ అప్‌డేట్.ఏపీకే అనే మెసేజ్‌ను హ్యాక్ చేసిన ఫోన్ నంబర్ల వాట్సాప్ ద్వారా ఇతరులకు, గ్రూపులకు ఫార్వర్డ్ చేస్తున్నారు. పరిచయస్తుడి నుంచి వచ్చిందనుకొని ఎవరైనా ఆ మెసేజ్‌ను ఓపెన్ చేస్తే నేరగాళ్లు వారి నంబర్‌ను హ్యాక్ చేస్తున్నారు. హ్యాక్ చేసిన నంబర్‌కు సంబంధించిన గూగుల్‌పే, ఫోన్‌పే, నెట్‌బ్యాంకింగ్‌ల నుంచి డబ్బులు మాయమవుతున్నాయి. అదే విధంగా డెబిట్, క్రెడిట్‌కార్డుల అకౌంట్లు హ్యాక్ అవుతున్నాయి. సైబర్ నేరగాళ్లు ఫ్లిప్‌కార్డుల ద్వారా డబ్బులను డ్రా చేసుకుంటున్నారు. డెబిట్‌కార్డులకు వినియోగించే సందర్భంలో వచ్చే ఓటీపీలు కూడా సైబర్ నేరగాళ్లకు తెలుస్తున్నాయి. ఈ మధ్యకాలంలో మండలంలో ఈ తరహా మోసాలకు పలువురు బలయ్యారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌కు కూడా 8వరకు ఫిర్యాదులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అవమానంతో స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేయనివారు సైతం ఉన్నారు.

మోసాలపై 1930కు ఫిర్యాదు చేయాలి

ఫోన్ హ్యాక్‌అయ్యి డెబిట్, క్రెడిట్ కార్డుల నుంచి డబ్బులు డ్రా అవుతున్నట్లు ఓటీపీ నంబర్లు మెసేజ్ వస్తే వెంటనే కార్డులను బ్లాక్ చేయించి, బ్యాంకు అకౌంట్‌ను హోల్డ్‌లో పెట్టించాలి. అనంతరం వెంటనే సైబర్‌క్రైంకు సంబంధించిన 1930నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. అదే విధంగా స్నేహితులను, బంధువులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరస్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అనవసర మెసేజ్‌లకు స్పందించకుండా వాటిని ఓపెన్ చేయకుండా ఉండడం మంచిది. పిల్లల వద్ద ఫోన్లను ఉంచకూడదు. అదే విధంగా అపరిచిత వ్యక్తులకు ఓటీపీలు చెప్పకూడదు. దురాశకు పోయి అపరిచత వ్యక్తులకు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా డబ్బులు పంపకూడదు.

– పి. మల్లయ్య, ఎస్‌ఐ రామన్నపేట

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్ట రూరల్ : పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తదితరులు

యాదగిరిగుట్ట రూరల్ : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. మండలంలోని వంగపల్లిలో గురువారం రామాలయ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీసీతారామాంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ కానుగు కవిత, పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాల్‌రాజ్‌గౌడ్, ఎంపీటీసీ రేపాక మౌనిక, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రాజాపేట : మండలంలోని చల్లూరు గ్రామానికి చెందిన చెందిన బైకని బీరప్ప, గుంటి బాలమ్మ ఇటీవల మృతి చెందారు. గురువారం బాధిత కుటుంబాలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు నమిల మహేందర్‌గౌడ్, జిల్లా నాయకులు బుడిగ పెంటయ్య, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బొంత సుధాకర్, బాల్‌నరసయ్య, కనకయ్య తదితరులున్నారు.

వారసత్వ వీఆర్‌ఏలకు న్యాయం చేయాలి

భూదాన్‌పోచంపల్లి : వారసత్వ వీఆర్‌ఏలకు తగిన న్యాయం చేసి ఆదుకోవాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కొమ్ము ఊషయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో 55నుంచి61సంవత్సరాలలోపు వయస్సు కలిగిన వీఆర్‌ఏల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం వీఆర్‌ఏల సర్దుబాటు కోసం తెచ్చిన జీఓ 81, 85, 98తో రాష్ట్రంలో 2500, మండలంలో 16మంది వారసత్వ వీఆర్‌ఏల దళిత కుటుంబాలు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేసి గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓలను సవరించి 55నుంచి61సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారసత్వ వీఆర్‌ఏలకు తిరిగి వీఆర్‌ఏలుగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో వారసత్వ వీఆర్‌ఏలు గోదాసు శివయ్య, కొమిరె మల్లయ్య, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగిఉండాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, ఆలయ కమిటీ సభ్యులు

చౌటుప్పల్ : ప్రతిఒక్కరూ భక్తిభావం కలిగిఉండాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలోని 9, 10వ వార్డుల పరిధి మారుతీనగర్‌లోని శ్రీపెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించే హనుమాన్ జయంతోత్సవాల కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, హనుమాన్ జయంతోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొడిగె అరుణ బాలకృష్ణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఉప్పు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి పోలోజు శ్రీనివాస్‌చారి, ప్రతినిధులు ముత్యాల భూపాల్‌రెడ్డి, పోలోజు శ్రీనివాస్‌చారి, అన్నెమోని చంద్రయ్య, ముత్యాల హన్మంతరెడ్డి, దేప రాజు, ఎన్నం బాలరాజు, దోర్నాల పద్మఋషి, సుంకి రవి, కర్నాటి జనార్దన్, గుర్రం బాలరాజు, తదితరులు ఉన్నారు.

బీటీరోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

చౌటుప్పల్ : పట్టణంలోని మార్కండేయస్వామి దేవాలయం నుంచి ముత్యాల శంభారెడ్డి వ్యవసాయ క్షేత్రం మీదుగా తాళ్లసింగారం క్రాస్‌రోడ్డు వరకు నిర్మించనున్న బీటీరోడ్డు నిర్మాణ పనులను గురువారం మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు వెంట ఇప్పటికే నిర్మించిన డ్రెయినేజీలోకి పరిసర కాలనీల నుంచి మురుగునీరు రావడానికి వీలుగా ముందస్తుగా పైప్‌లు వేయాలని సూచించారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే హైవే నుంచి వలిగొండ రోడ్డువైపుకు వెళ్లే వాహనాల రద్దీ చాలా వరకు తగ్గుతుందన్నారు. ఆయన వెంట బొడిగె బాలకృష్ణ, కౌన్సిలర్ గోపగోని లక్ష్మణ్, స్థానికులు ముత్యాల భూపాల్ రెడ్డి, దేప రాజు, తదితరులు ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనుల పరిశీలన



బొమ్మలరామారం : అధికారులకు సూచనలిస్తున్న నోడల్ అధికారి జ్యోతికుమార్

బొమ్మలరామారం : అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను సకాలంలో పూర్తి చేయాలని నోడల్ అధికారి జ్యోతికుమార్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పాఠశాలలు పునఃప్రారంభానికి ముందే పెండింగ్ పనులు పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని మండల అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్, పంచాయతీరాజ్ ఏఈ తులసికృష్ణ, జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పద్మజ ఉన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని రహీంఖాన్‌పేట ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన విద్యుత్, మంచినీటి వసతి, పాఠశాల మైనర్ నిర్మాణ పనులను అమ్మ ఆదర్శ పాఠశాలల ఏఈ కె.ధనలక్ష్మి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపడుతున్న పనులను నాణ్యతో చేయాలని సూచించారు. త్వరలోనే పాఠశాలలు తెరుస్తున్నందున పనులు తొందరగా పూర్తి చేయాలని సూచించారు. ఆమె వెంట అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పల్లవి, ఎంపీఓ పద్మావతి, హెచ్‌ఎం దీప్తికరుణ, పంచాయతీ కార్యదర్శి స్వాతి ఉన్నారు.

ఐకేపీల్లో ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలి



మర్రిగూడెంలోని ఐకేపీ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీపీఐ, రైతు సంఘం నాయకులు

యాదగిరిగుట్ట రూరల్ : ఐకేపీ కేంద్రాల్లో నిల్వ ఉన్న వరిధాన్యాన్ని వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లూరు రాజయ్య అన్నారు. గురువారం మండలంలోని మర్రిగూడెం, చొల్లేరు గ్రామాల్లోని ఐకేపీ సెంటర్లను వారు పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం మిల్లర్లను ధాన్యం త్వరగా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇంకా ఆయా సెంటర్లలో నిల్వ ఉంచారని అన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందని, వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం సీజన్ సమీపిస్తున్నందున రైతులకు విత్తనాలను, ఎరువులను సకాలంలో అందజేయాలన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టడానికి ప్రత్యేక అధికారులను నియమించాలని కోరారు. వారి వెంట జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్, మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, రైతు సంఘం నాయకులు మీసాల దాసు, బోదాసు స్వామి, గడ్డం లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

యథేచ్ఛగా చెరువు మట్టి తరలింపు



రాజాపేట : రఘునాథపురంలో చెరువు నుంచి టిప్పర్లతో మట్టి తెచ్చి నిల్వ చేస్తున్న వ్యాపారులు

రాజాపేట : మండలంలో రోజురోజుకు మట్టి అక్రమ రవాణా ఆగడం లేదు. చెరువుల నుంచి యథేచ్ఛగా ఎలాంటి అనుమతులు లేకుండా వ్యాపారులు మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే మండలంలోని బేగంపేట, నెమిలె గ్రామాల చెరువుల నుంచి అనుమతులు లేకుండా వందలాది ట్రిప్పుల మట్టి తరలించినట్లు అధికారుల దృష్టికి వచ్చినా ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పలు విమర్శలకు దారితీస్తోంది. గురువారం మండలంలోని రఘునాథపురం గ్రామంలో ఓ ఇటుక బట్టి నిర్వాహకుడు అనుమతులు లేకుండా టిప్పర్లతో మట్టిని మండలంలోని సోమారం గ్రామం నుంచి తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టిని అక్రమంగా తరలించకుండా నిలిపివేయాలని రైతులు కోరుతున్నారు.

మోటకొండూర్ : మండల కేంద్రంలోని రాయికుంటపల్లి ఊరచెరువు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు ఇటుక బట్టీల యజమానులు గురువారం బంకమట్టిని తరలిస్తున్నారు. దీంతో గురువారం గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఇరిగేషన్ డీఈ సునిల్‌ప్రసాద్, ఎంపీఓ కిషన్‌ల ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ సిబ్బంది, ఇరిగేషన్ సిబ్బంది వాహనాలను నిలిపివేశారు. అనుమతులు ఉంటేనే మట్టిని తరలించాలని సూచించారు. 3సంవత్సరాలుగా మట్టి తరలిస్తూ కోట్లు గడిస్తున్న ఇటుక బట్టీల యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.



మోటకొండూర్ : రాయికుంటపల్లి చెరువు నుంచి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ఒండుమట్టి

సమస్యలపై సీఐటీయూ రాజీలేని పోరాటం



బొమ్మలరామారం : మర్యాలలో జెండావిష్కరణ చేస్తున్న సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు

బొమ్మలరామారం : కార్మికుల సమస్యల పరిష్కారంలో సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి పాండు అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పాండు సంఘం జెండావిష్కరణ చేసి మాట్లాడారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ర్యాకల శ్రీశైలం, బాలయ్య, ఐలయ్య, సత్తయ్య, ఎల్లయ్య, మణెమ్మ, లక్ష్మి, పెంటమ్మ, అండాలు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ఐక్య ఉద్యమాల దిక్సూచి సీఐటీయూ

మోత్కూరు : కార్మికవర్గ ఐక్య ఉద్యమాల దిక్సూచి సీఐటీయూ (సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్) అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేషం అన్నారు. గురువాంర మున్సిపల్ కేంద్రంలో రైస్‌మిల్ హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సంఘం జెండాను ఎగురవేసి కేక్ కట్ చేశారు. అనంతరం మల్లేషం మాట్లాడారు. 1970 మే 30న పశ్చిమబెంగాల్ రాష్ట్రం కలకత్తాలో సీఐటీయూ ఆవిర్భవించిందని, నాటి నుంచి కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా నేటి వరకు 22 సమ్మెలే జరిగాయని, కోట్లాది మంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సామ శ్రీనివాస్‌రెడ్డి, హమాలీ, లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు దొండా నాగరాజు, నాయకులు గుంటి ఉపేందర్, కొంగరి నర్సింహ, కురుమేటి విక్రమ్, అబ్బాస్, సంతోష్, రోహిత్, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

తుర్కపల్లి : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు పోతరాజు జహంగీర్ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్మిక వర్గానికి అండగా, ఐక్య ఉద్యమాలు చేయడంలో సీఐటీయూ కీలకంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కన్వీనర్ తూటి వెంకటేశం, శ్రీ గురు రాఘవేంద్ర ఆటోయూనియన్ నాయకులు కట్కూరి వెంకటేశం, వల్లపు కనకయ్య, శ్రీనివాస్, చాంద్‌పాషా, జిన్నా కరుణాకర్, జాంగీర్, గడ్డమీది నర్సింహులు, బింగి నీలకంఠం, రమేశ్, గ్రామపంచాయతీ నాయకులు పోచమ్మ, లక్ష్మి, సుశీల, లావణ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.

వలిగొండ : మండల కేంద్రంలో సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల కన్వీనర్ తుర్కపల్లి సురేందర్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఐటీయూ సంఘటిత, అసంఘటిత కార్మికుల కోసం పోరాటాలు నిర్వహిస్తుందని, దేశ వ్యాప్తంగా కార్మికుల కోసం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో రాదారపు మల్లేశం, జంగయ్య, నర్సింహ, వీరస్వామి, ఎల్లయ్య పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని పెద్దకందుకూరు గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ పరిశ్రమ ఎదుట సీఐటీయూ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం పాల్గొని మాట్లాడారు. కార్మిక ఐక్య ఉద్యమాల సారథి సీఐటీయూ అని అన్నారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ పుప్పాల గణేష్, కంబాల స్వామి, సత్యనారాయణ, వెంకటయ్య, నగేష్, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.



మోత్కూరులో జెండా ఎగురవేస్తున్న సంఘం జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేషం



తుర్కపల్లి : సీఐటీయూ జెండా ఎగురవేస్తున్న జహంగీర్



వలిగొండలో..



యాదగిరిగుట్ట రూరల్‌లో..

అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తాండ్ర అమరావతి

గుండాల : మండల సర్వసభ్య సమావేశానికి నివేదికలు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం తగదని ఎంపీపీ తాండ్ర అమరావతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తాండ్ర అమరావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐదు సంవత్సరాలుగా మండల అభివృద్ధికి అధికారులు సహకరించారని అన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించేందుకు కృషి చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించారని కితాబు ఇచ్చారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి సమావేశాన్ని సాదాసీదాగా ముగించారు. సమావేశంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎండీ.ఖలీల్, రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎండీ.షర్ఫోద్దీన్, ఎంపీటీసీలు కుంచాల సుశీల, పొన్నగాని మహేష్, కేమిడి అనిత, ఎంపీడీఓ ఎ.దేవిక, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ హైమావతి, ఏఓ లావణ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనూష, ఏపీఓ ఇమ్మాన్యుయల్, ఏపీఎం అంజయ్య, సీడీపీఓ జ్యోష్న, ఎంఆర్‌ఐ వెంకటేశ్వర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

మోత్కూరు : మండలంలోని అనాజిపురం గ్రామంలో అభయాంజనేయస్వామి దేవాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని భక్తులు గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ముందుగా గణపతి పూజ, స్వస్తివాచనం, మండపారాధన, పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించి పంచామృతాలతో అభిషేకం చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయస్వామి మాలధారులు ఇరుముడి కట్టుకొని కొండగట్టుకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన భక్తులు కుంచాల మధురాంరెడ్డి రాధిక దంపతులు రూ.1.25లక్షల విలువ గల ఇత్తడి తొడుగును ఆంజనేయస్వామికి బహూకరించారు. కార్యక్రమంలో దేవాలయ నిర్మాణ దాత గోరుపల్లి సంతోష్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి ఏజాజ్ అలీఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జీరాక్స్‌ను తీసుకొని రావాలన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు జామచెట్లబావి గ్రామంలో కొన్ని నెలలుగా విద్యుత్ లోఓల్టేజి సమస్య తలెత్తుతుంది. దీంతో సమస్యను స్థానిక కౌన్సిలర్ దబ్బెటి విజయరమేష్ మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి అధికారులతో మాట్లాడి గురువారం సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించారు.

సభను జయప్రదం చేయాలి

భువనగిరి : నల్లగొండ పట్టణంలో నేడు నిర్వహించనున్న విద్యా సదస్సు– అభినందన సభను జయప్రదం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మైలారం సత్తయ్య, లక్ష్మీనర్సింహారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎస్‌బీఆర్ ఫంక్షన్ హాల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ హరగోపాల్, ప్రముఖ పత్రికా సంపాదకులు వేణుగోపాల్ హాజరు కానున్నట్లు తెలిపారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలి

సంస్థాన్ నారాయణపురం : మండలంలోని సర్వేల్ గ్రామంలో విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్టు షాపులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల కార్యదర్శి బూస శ్రీనివాస్‌గుప్తా గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు.

అధికారుల స్థల పరిశీలన

బొమ్మలరామారం : మండలంలోని నాగినేనిపల్లిలో ప్రభుత్వ భూమి 245 బై 1 సర్వే నంబరులో 2.832 హెక్టారుల్లో కంకరమిల్లు ఏర్పాటుపై గ్రామానికి చెందిన ఇప్పలపల్లి నరేందర్ అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల ఆర్‌ఐ వెంకట్ రెడ్డి, సర్వేయర్ శ్రీనివాస్, మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ వెంకన్న, మైనింగ్ సర్వేయర్ వెంకటేశ్వర్లు, కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీయర్ రామకృష్ణ, ఇరిగేషన్ డీఈ కవిత, ఏఈలు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

మోత్కూరు : పట్టణంలోని సుందరయ్య కాలనీకి చెందిన వల్లాల రామకృష్ణ వెన్నుపూస విరిగి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో బాధితుడికి గురువారం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. వారిలో జంగ శ్రీను, పురుగుల మల్లయ్య, జంగ సతీష్, రాజాలు, రమేష్, నరేష్ ఉన్నారు.